సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 26 । జూలై । 2024



పోలీసుల వీరంగం !

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై ట్రాఫిక్ పోలీసులు దాడిచేసే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 12లో▸



మెదడువాపు నివారణకు..

పిల్లలకు మెదడువాపు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ తెలిపారు. 12లో▸



రైతులను మోసం

సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. 12లో▸

రేపు తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

తుక్కుగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : తుక్కుగూడ
కమిషనర్ : బి.వెంకట్రామ్
తేదీ : 27-7-2024 (శనివారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
79895 50789

న్యూస్‌రీల్

నేడు గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారి శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు తీసుకుని మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టలో ఉన్న చేవెళ్ల గురుకుల కళాశాలలో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు.

మొక్కల పెంపకం బాధ్యత

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



గునుగల్ అటవీ క్షేత్రంలో మొక్క నాటి నీరు పోస్తున్న ప్రతిమాసింగ్

యాచారం: మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గునుగల్ అటవీ ప్రాంతంలో గురువారం ఆమె మొక్కలు నాటారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 8 లక్షల మొక్కల నాటే టార్గెట్‌కుగాను ఇప్పటికే 6 లక్షలు నాటారని తెలుసుకుని డివిజన్ అటవీ శాఖ అధికారి విష్ణువర్ధన్‌రావును అభినందించారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మరో పక్షం రోజుల్లో 2 లక్షల మొక్కలు నాటుతామని అటవీ శాఖ అధికారులు అదనపు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం అటవీ శాఖ డివిజన్ పరిధిలో లక్షలాది మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మొక్కలు నాటేందుకు ఇది మంచి అవకాశమన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకార్‌రెడ్డి, ఆమన్‌గల్ డివిజన్ అటవీ శాఖ అధికారి వేణుమాధవరావు, ఇబ్రహీంపట్నం డివిజన్ అటవీ శాఖ అధికారి విష్ణువర్ధన్‌రావు, అధికారులు నర్సింహ, ఇంద్రసేనరెడ్డి, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని విస్తరించండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి నేతల వినతి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఆచారి, సుధాకర్‌రావ్, శ్రీవర్ధన్

ఆమనగల్లు/షాద్‌నగర్: హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరించాలని కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలోని మంత్రి గడ్కరీ నివాసంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. తుక్కుగూడ నుంచి కల్వకుర్తి వరకు ఆరు లైన్‌ల రహదారి, కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు నాలుగు లైన్లుగా జాతీయ రహదారిని విస్తరించాలని ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. 167 నంబరు జాతీయ రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు.





అరకొరే..!

జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన బడ్జెట్

- రీజినల్ రింగ్‌రోడ్డుకు స్వల్ప కేటాయింపులు
- 'పాలమూరు-రంగారెడ్డి'కి రూ.2వేల కోట్లతో సరి
- మున్సిపాలిటీలకు దక్కని ప్రాధాన్యం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రేవంత్ సర్కార్‌పై జిల్లా ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి.బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోగా, జిల్లాను ఓ ఆదాయ వనరుగా చూడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు చెందిన కీలక ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది.కీలకమైనపాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.రెండువేల కోట్లతో సరిపెట్టింది. శివారు మున్సిపాలిటీల అభివృద్ధిని ప్రస్తావించలేదు.ఫార్మాసిటీ భూముల్లో టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు కనీస కేటాయింపులు లేవు. మహేశ్వరం మెడికల్ కాలేజీ భవనాలకు నిధులు విదల్చలేదు. భూముల అమ్మకాలు,రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు,ఇంటి పన్నుల వసూళ్లు, ఎక్సైజ్ శాఖల ద్వారా జిల్లా నుంచే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. ఆ స్థాయిలో కేటాయింపులు లేకపోవడాన్ని జిల్లా వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు.

హైడ్రా పరిధిలోకి మున్సిపాలిటీలు

ఔటర్ లోపల ఉన్న మున్సిపాలిటీలను నగరంలో అంతర్భాగం చేయనున్నట్లు ప్రకటించింది. విపత్తుల నిర్వహణ కోసం హైడ్రాను అందుబాటులోకి తెచ్చింది. చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి చేయనుంది. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, మెట్రోవాటర్ బోర్డు, విద్యుత్‌శాఖలను హైడ్రా పరిధిలోకి తీసుకొచ్చి, విపత్తుల సమయంలో కలిసి పని చేసేందుకు బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించడం శుభపరిణామం.

ఓఆర్ఆర్–ఆర్ఆర్ఆర్ మధ్య అభివృద్ధి

ఆర్ఆర్ఆర్ (చౌటుప్పల్-షాద్‌నగర్-సంగారెడ్డి) దక్షిణ ప్రాంతంలోని 189 కిలోమీటర్ల పొడవున భూ సేకరణ, ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలకు దీటుగా తొలుత నాలుగు లేన్ల రహదారిని నిర్మించనుంది. ఇందుకు బడ్జెట్‌లో రూ.12,980 కోట్లు ఖర్చవుతున్నట్లు ప్రతిపాదించింది. ఆ తర్వాత దీన్ని ఆరు లేన్లుగా విస్తరించనున్నట్లు ప్రకటించింది. దీనిలో మెజార్టీ రోడ్డు జిల్లా నుంచే వెళ్తుంది. ఇటు ఓఆర్ఆర్, అటు ఆర్ఆర్ఆర్ మధ్య పలు పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, రవాణా పార్కులు అభివృద్ధి చెందనున్నాయి.

ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో

బడ్జెట్‌లో మెట్రోకు పెద్దపీట వేసింది. రూ.1,500 కోట్లు కేటాయించింది. జిల్లాలోని రెండు కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. దీనిలో భాగంగా నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు లైన్ ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించింది.ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోను విస్తరించనుంది. తద్వారా శివారు మున్సిపాలిటీలకు రవాణ సదుపాయాన్ని అందుబాటులోకి తేనుంది.

28వేల ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 2024–25లో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున జిల్లాకు మొత్తం 28,000 ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఎస్సీ, ఎస్టీలకు రూ.ఆరు లక్షల చొప్పున చెల్లించనుంది.

తలసరిలో నంబర్ వన్

జాతీయ తలసరి ఆదాయం రూ.1,83,236 ఉండగా, తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,47,299 ఉంది. జిల్లా తలసరి ఆదాయం రూ.9,46,862 ఉండగా, వికారాబాద్‌జిల్లా తలసరి ఆదాయం రూ.1,80,241 ఉంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగి ఉన్న జిల్లాల జాబితాలో రంగారెడ్డి ప్రథమ స్థానంలో ఉన్నట్లు ప్రకటించింది.

ప్రస్తావనతోనే సరి

పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయప్రతిపాదించిన స్కిల్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణతో పాటు ఏఐ పరిశోధన కేంద్రానికి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరుపలేదు.

మూసీకి రూ.1,500 కోట్లు

గండిపేట్ నుంచి ఘట్కేసర్ వరకు 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మూసీ..మెజార్టీ భాగం ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలోనే ఉంది. ఈ నదిని లండన్ థేమ్స్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం నదికి రెండువైపులా 50 మీటర్ల పరిధిలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, రెవెన్యూ తదితర విభాగాల సమన్వయంతో ఏర్పడిన 33 బృందాలు ఈ మార్గంలో సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నాయి. మరో రెండు నెలల్లో సర్వే పూర్తి కానుంది. ఇప్పటి వరకు నదికి రెండు వైపులా 50 మీటర్ల పరిధిలో సుమారు 12,500 నిర్మాణాలను తొలగించాల్సి ఉంది.

విద్యారంగానికి అంతంతే..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం అన్యాయం. విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పి నిధుల కేటాయింపులో చూపించలేక పోయింది.

– సత్తు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూటీఎస్

జనరంజకంగా ఉంది



అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ జనరంజకంగా ఉంది.అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించింది. రైతు, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది.

– చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షుడు

ప్రజల ఆశలపై నీళ్లు



సీఎం రేవంత్‌కు సొంత నియోజకవర్గంపై ఉన్న ప్రేమ ఇతర నియోజకవర్గాలపై లేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. ప్రజల ఆశలపై నీళ్లు జల్లారు.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అందరికీ ఆమోదయోగ్యం



అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్. విద్య, వైద్యం, రైతాంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. పదేళ్ల తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అందరికీ న్యాయం చేకూర్చేలా ఉంది.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం

క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే..

మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సీజనల్ వ్యాధుల నియంత్రణ, సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్లు నిత్యం ఏదో ఒక వార్డు/డివిజన్‌లో పర్యటించాల్సిందేనని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులు, వనమహోత్సవం, వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు, అసంపూర్తిగా మిగిలిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మున్సిపల్ కమిషనర్ ఉదయాన్నే ఏడు గంటలకు ఫీల్డ్ విజిట్‌లో ఉండి, శానిటరీ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లలో నివాసం ఉంటున్న కుటుంబాలను గుర్తించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్లోరినేషన్ శాతాన్ని పెంచాలని సూచించారు.

కుక్కల బెడద లేకుండా చూడాలి

డెంగీ, మలేరియా వ్యాధులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, కాలనీల్లో నీటి నిల్వలు లేకుండా, దోమల బెడద లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. కాలనీల్లో వీధి కుక్కల బెడద లేకుండా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా వివిధ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకొని మున్సిపల్ పరిధిలో సెంటర్లను ఏర్పాటు చేసి వీధికుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించాలన్నారు. వనమహోత్సంలో భాగంగా గేటెడ్ కమ్యూనిటీ, వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ వాసులను భాగస్వాములు చేసి ప్రతి ఇంటికీ మొక్కల పంపిణీ చేపట్టాలన్నారు. అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి, మున్సిపల్ వారికి కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా అటవీశాఖ అధికారులు, పీడీ మెప్మా, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే పంపాలి..

క్షేత్రస్థాయిలోని ప్రభుత్వ అధికారులు ఈ ఆఫీసు ద్వారానే ఫైళ్లను నిర్వహించాలని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఈ–ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానంపైనే ఆధారపడి ఉంటాయని, ప్రతి శాఖలో ఈ–ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని అన్నారు. ఇందుకు అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతి శాఖ అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని, శాఖల వారీగా లాగిన్స్ పెండింగ్‌లో లేకుండా త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, వ్యవసాయ, మత్స్య, పంచాయతీ, ఉద్యా నవన, మహిళా శిశు సంక్షేమ, మైనారిటీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, పంచాయతీ రాజ్, మెప్మా మొదలైన శాఖల్లో బల్క్ ఈమెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తదితరులు పాల్గొన్నారు.

'పారిశుద్ధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తున్నాం.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం.. ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం.. సమస్యల రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం.. ప్రధానంగా కోతులు, కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపడతాం' అని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. ఆయా వార్డుల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. మున్సిపల్ డీఈఈ శివానందం, మేనేజర్ కిరణ్‌కుమార్, సిబ్బందితో కలిసి కమిషనర్ వాటిని నోట్ చేసుకున్నారు. సమస్యల తీవ్రతను బట్టి తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

– అబ్దుల్లాపూర్‌మెట్

పారిశుద్ధ్యానికి పెద్దపీట



సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

- ప్రణాళికాబద్ధంగా చర్యలు
- సమస్యల పరిష్కారానికి కృషి
- పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీంద్‌రెడ్డి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు స్పందన

సాక్షి ఫోన్ ఇన్

వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.. చిన్న పిల్లలు, మహిళలు బయటకు రావాలంటే భయమేస్తోంది.

– రమ–శ్రీరాంకాలనీ, విద్యావతి సాయినగర్, నాగరాజు–మైత్రికుటీర్, రవీందర్ రెడ్డి –వినాయకనగర్ కాలనీ, ప్రవీణ్ –గణేశ్‌నగర్‌కాలనీ, ఆనంద్–మోహన్‌రెడ్డికాలనీ, భాస్కర్‌రెడ్డి–కుంట్లూర్

కమిషనర్: విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. బ్లూక్రాస్ సొసైటీ సహకారంతో వీధి కుక్కలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. త్వరలోనే అన్ని వార్డుల్లో వాటి నుంచి విముక్తి కలిగించేందుకు చర్యలు తీసుకుంటాం.

పెద్దఅంబంబర్‌పేట నుంచి పసుమాముల మార్గంలో ఓపెన్ డ్రైనేజీ కారణంగా వర్షాకాలంలో మురుగునీరు రోడ్డు మీద పారుతోంది. తీవ్ర దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– పోరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శిల్పికాలనీ

కమిషనర్: తక్షణమే ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పరిశీలించి పాలకవర్గం అనుమతితో పైపులైన్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమల వ్యాప్తి జరుగుతోంది. తాగునీటి నల్లా బిల్లులు విపరీతంగా వేస్తున్నారు.

– రావుల రవి, సిద్దంకి సత్తిరెడ్డికాలనీ అధ్యక్షుడు

కమిషనర్: తక్షణమే పార్కులను పరిశీలించి వాటిల్లో పెరిగిన గడ్డిని తొలగింపజేస్తాం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. నల్లా బిల్లుల విషయాన్ని మెట్రో వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

కుంట్లూర్–పసుమాముల మార్గంలో తాగునీటి పైపులైన్లు, డ్రైనేజీ పైపులైన్లు లీకేజీ అవుతున్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతుండడంతో దుర్వాసన వస్తోంది.

– జోర్కరాము ముదిరాజ్, సునీల్‌రెడ్డి, కుంట్లూర్

కమిషనర్: పగిలిన పైపులైన్లు, డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌కు మరమ్మతులు చేయిస్తాం.

కుంట్లూర్ 19, 22వ వార్డు పరిధిలో తాగునీటి పైపులైన్, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం సీసీరోడ్లను తొలగించి పూడ్చడం మర్చిపోయారు. రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబు, కుంట్లూర్

కమిషనర్: ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలన చేయించి, మరమ్మతులు చేయిస్తాం.

ఇళ్ల మధ్యలో ఉన్న రెడీమిక్స్ ప్లాంట్లతో విపరీతంగా దుమ్ము వస్తోంది. సమీపంలో ఉన్న వేద పాఠశాలకు చెందిన సెప్టిక్ ట్యాంక్ నిండి బయటకు పొంగిపొర్లుతుండడంతో దుర్వాసన వస్తోంది.

– కృష్ణ,19వ వార్డు,కుంట్లూర్

కమిషనర్: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులన్నాయా లేదా.. అని తెలుసుకుని ప్లాంటు నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే తక్షణమే తరలించే ఏర్పాటు చేస్తాం. దుర్వాసనకు కారణమైన సెప్టిక్ ట్యాంక్‌ను ఎత్తివేయించాలంటూ పాఠశాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేస్తాం.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. కాలనీల్లో ఇంకా ఫాగింగ్ ప్రారంభించలేదు.

– శ్రీకాంత్‌కుమార్‌గౌడ్– పసుమాముల, పీఎస్‌కుమార్–కల్వంచ, మురళీధర్‌రెడ్డి – శ్రీరాంనగర్ కాలనీ

కమిషనర్: నీటి నిల్వలు ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ చల్లిస్తున్నాం. కాలనీల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం. వర్షం కారణంగా రెండు, మూడు రోజుల నుంచి నిలిపివేయించాం. తిరిగి ప్రక్రియను కొనసాగిస్తాం. వాటర్ సంపులు, ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలిస్తాం. చెత్త వేసే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

పెద్దఅంబర్‌పేట ప్రధాన కూడలిలో బోనమ్మ గుడి వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ పగిలి మురుగు నీరు రోడ్డు మీదకు వస్తోంది. దుర్వాసనతో పాటు దోమలు విపరీతంగా వస్తున్నాయి. వీధికుక్కల సమస్యను పరిష్కరించండి.

– పొడిచెట్టి నిఖిల్‌గౌడ్, పెద్దఅంబర్‌పేట

కమిషనర్: పగిలిన డ్రైనేజీ మ్యాన్ హోల్ మరమ్మతులకు తక్షణమే చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలను పట్టుకునే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. చేతికి అందే ఎత్తులోనే ఉండడంతో భయంగా ఉంది. ఓల్టేజీ సమస్యతో ఎలక్ట్రానిక్ వస్తువులు పాడవుతున్నాయి.

– మంగరాజు, స్వగృహకాలనీ, 7వ వార్డు

కమిషనర్: సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తాం.

రాజశ్రీ స్కూల్ వెనుక రోడ్డులో,4వ వార్డు మైత్రీ లహరీ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. లక్ష్మారెడ్డిపాలెం నుంచి పెద్దఅంబర్‌పేటకు వచ్చే మార్గంలో జేసీబీ షోరూం గుంతలతో ప్రమాదకరంగా మారింది.

– రమణమూర్తి అధ్యక్షుడు, మైత్రీలహరికాలనీ, గంధం పవన్‌కుమార్, పెద్దఅంబర్‌పేట

కమిషనర్: పాడైపోయిన వీధి దీపాలను తొలగించి వాటి స్థానాల్లో కొత్తవి వేయించేందుకు చర్యలు తీసుకుంటాం. గుంతలు ఏర్పడిన రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించి, బీటీ రోడ్డుకు చర్యలు తీసుకుంటాం.

పోలీస్ పహారాలో చిలుకూరు

మొయినాబాద్: చిలుకూరులో పోలీస్ పహారా కొనసాగుతోంది. మొయినాబాద్ మండలం చిలుకూరు రెవెన్యూ సర్వేనంబర్ 133లోని 4 గుంటల వక్ఫ్ బోర్డు స్థలంలో పురాతన నిర్మాణాన్ని తొలగించడంపై రెండు వర్గాలు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఇది మతపరమైన వివాదాలకు దారితీస్తుందని భావించిన పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాలకు నచ్చజెప్పి ఎవరినీ అక్కడికి రాకుండా చర్యలు తీసుకున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో యథాతథ స్థితిని కొనసాగిస్తున్నారు. స్థలం వద్దకు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. గురువారం సైతం పోలీస్ పికెటింగ్ కొనసాగింది. సుమారు 40 మంది పోలీసులు చిలుకూరులో పహారా కాస్తున్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి పంపిస్తున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంపై ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్ణయం తీసుకునేవరకు పోలీస్ పహారా కొనసాగుతుందని.. ఈ నెల 30 వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు.



వక్ఫ్‌బోర్డు స్థలం వద్ద ఏర్పాటు చేసి బారికేడ్లు

నిరుద్యోగులకు శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగ యువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట్‌లో లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో 38 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 20 ఏళ్ల వయసు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సీఐ విజయ్‌కుమార్


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

షాద్‌నగర్: నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలో పోలీసులు జాగిలాలతో కిరాణం దుకాణాలు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుందన్నారు. పొగాకు, నికోటిన్‌తో కూడిన గుట్కా తయారీ విక్రయాలపై నిషేధం విధించినట్లు తెలిపారు. గుట్కాలు నిల్వ ఉంచినా, రవాణా చేసినా, విక్రయాలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుట్కాలు తినడంతో నోటి క్యాన్సర్ ఏర్పడుతుందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆమనగల్లు–షాద్‌నగర్ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లికి చెందిన వడ్డె వేణు(19) బైక్‌పై వెళ్తుండగా స్థానిక వివేకానంద విగ్రహం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి వేణు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆమనగల్లు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

అడిషనల్ ఎస్పీ కుమారుడిపై దాడి

ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: అడిషనల్ ఎస్పీ కుమారుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై ఆదిబట్ల పోలిస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సురకంటి మల్లారెడ్డి (అడిషనల్ ఎస్పీ)కుమారుడు భరత్‌రెడ్డి సీవీఆర్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ నెల 24న స్నేహితుడు జాల వర్షిత్‌కు యాక్సిడెంట్ అయి.. మన్నెగూడలోని ప్రైవేటు అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భరత్.. తన కారులో అస్పత్రికి వెళ్లాడు. స్నేహితుడి మామ రోడ్డు ప్రమాదానికి కారకులైన వారితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదానికి కారకుడైన వ్యక్తి మిత్రులు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిపై దుర్భాషలాడారు. దీనికి భరత్ అడ్డు చెబుతూ.. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించాడు. దీంతో సదరు వ్యక్తులు భరత్‌పై దాడికి దిగారు. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతానికి పాడి ఆవు మృత్యువాత పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తిరునగరి వేణుగోపాల్‌కు చెందిన పాడి ఆవు పొలం వద్ద మేత మేసుకుంటూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తాగిలి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ కారు ఢీ కొట్టిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేతావత్ మోహన్ తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఎస్‌వీఎస్ వైన్స్ వద్ద రోడ్డు దాటుతుండగా.. ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న షిఫ్ట్ కారు మోహన్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు గాయాలు అయ్యాయి. చికిత్స కోసం క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసుల వీరంగం

- పట్టుబడిన యువకులను కొడుతున్న వీడియో వైరల్
- చేవెళ్లలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


సోషల్ మీడియాలో వైరల్ అయిన చిత్రం ఇదే

చేవెళ్ల: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన యువకులను చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు తిడుతూ కొట్టే వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చోటు చేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. పట్టుబడిన యువకులను ట్రాఫిక్ పోలీసులు కొడుతూ, తిడుతూ పట్టుకు వచ్చే వీడియోలు వైరల్ అవుతున్నాయి. పట్టుబడితే కేసు నమోదు చేయాలి కానీ ఇలా బూతు మాటలు తిడుతూ, కొట్టడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటనకు పాల్పడిన సీఐ వెంకటేశం, కానిస్టేబుల్ శ్రీను, హోంగార్డు కేశవ్‌లపై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.

విధులకు ఆటంకం కలిగించారు:
వెంకటేశం, ట్రాఫిక్ సీఐ, చేవెళ్ల

తమ సిబ్బందితో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా చేవెళ్ల వైపు నుంచి ఓ కారులో ముగ్గురు యువకులు వచ్చారు. వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ మిషన్‌తో చెక్ చేసేందుకు సిబ్బంది వెళ్లగా సహకరించకుండా కారు దిగి పారిపోయారు. డ్రైవింగ్ చేస్తున్న మహేశ్ మద్యం తాగి ఉన్నాడు. అతనితోపాటు ఉన్న వారు కూడా మద్యం మత్తులో ఉన్నారు. పోలీసులను తిడుతూ పారిపోయేందుకు ప్రయత్నించటంతో వారిని వెంటాడి పట్టుకున్నాం. మిషన్‌తో చెక్ చేయగా 90 శాతం వచ్చింది. పేరు అడిగితే తప్పుగా చెప్పి దూషించారు. దీంతో చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో వారిపై తమ విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేశాం. వీడియో మేము పట్టుకునేది మాత్రమే తీసి వైరల్ చేస్తున్నారు. వారు పట్టుబడినప్పుడు పోలీసులను తిట్టింది వైరల్ చేయలేదు.

మెదడువాపు నివారణకు టీకాలు

తప్పనిసరిగా వేయించాలని
డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ పిలుపు


అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

మొయినాబాద్‌రూరల్: చిన్న పిల్లలకు మెదడువాపు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తుగా టీకాలు వేయిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముందుగా రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలో ఈ వ్యాక్సినేషన్ ప్రారంభమైందన్నారు. మండలంలో అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తేదీల వారీగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేస్తారన్నారు. గురువారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు మెదడువాపు వ్యాధి నివారణ కోసం జేఈ టీకా ఇస్తామన్నారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. వైద్యులు, సిబ్బంది విద్యార్థుల పట్ల జాగ్రత్తలు వహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అన్నపూర్ణ, వైద్యులు తారాఫాతిమా, ఫిర్దోస్‌బేగం, సాయిబాబా, సూపర్‌వైజర్ సునీతాదేవి, ప్రధానోపాధ్యాయుడు అరుణ్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఏరోసిటీలో అద్దెకు వర్క్‌స్పేస్

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో జీఎంఆర్ ఏరోసిటీ బిజినెస్ పార్కులో రీగస్ సంస్థ సౌకర్యవంతమైన వర్క్‌స్పేస్ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చే కార్యాలయాలతో పాటు ఒకరోజు, ఒక గంట సమయానికి సమావేశమయ్యేందుకు కావాల్సిన గదులు ఇందులో అందుబాటులో ఉన్నాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈఓ అమన్ కపూర్ దీన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వివిధ ప్రాంతాల వాణిజ్య రంగాలను అనుసంధానం చేయడానికి ఈ స్పేస్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. ఆతిథ్యం, ఆరోగ్య సంరక్షణ, వినోదం, విద్య, పారిశ్రామిక పార్కులతో సమీకృతంగా ఏరోసిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. వాణిజ్య రంగాభివృద్ధిలో హైదరాబాద్ విస్తరణకు ఏరోసిటీ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఐడబ్ల్యూజీ కంట్రీ మేనేజర్ శ్రీహర్ష లాంబా అన్నారు.

వాగులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ దొడ్డి శివారులో ఉన్న వాగులో గురువారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి అతను మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నెలాఖరులోపు ఐటీఆర్ ఫైలింగ్ చేయండి

లక్డీకాపూల్: పన్ను చెల్లింపుదారులు నిబంధనల మేరకు ఐటీఆర్ (ఇన్‌కం టాక్స్ రిటర్న్స్) ఫైలింగ్ చేయాలని ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ ఆశిష్ కుమార్ శుక్లా సూచించారు. తప్పుడు క్లెయిమ్స్ చేయకూడదన్నారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల అధికారులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశిష్ కుమార్ శుక్లా మాట్లాడుతూ.. ఆదాయ పన్ను నమోదులో అన్ని రకాల ఆదాయ వివరాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఐటీఆర్ నమోదు చేసేటప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. కొత్త/పాత రీజిమ్‌లో ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఐటీఆర్‌ను ఈ నెల 31వ తేదీలోపు సమర్పించాలని, పత్రాలన్నీ పక్కాగా ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే బషీర్‌బాగ్‌లోని ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా రాధిక, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, ఆదాయపన్ను శాఖ అధికారులు వేణుగోపాల్, వందన తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లపై ఆరా

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా కొనసాగుతున్న ఏర్పాట్ల విషయమై జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ, పోలీసు అధికారులు గురువారం సమీక్షించారు. నగర అదనపు పోలీస్ కమిషనర్(శాంతి భద్రతలు) విక్రంసింగ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తదితరులు ఆలయాన్ని సందర్శించి బోనాలు, ఊరేగింపు ఏర్పాట్ల విషయమై అడిగి తెలుసుకున్నారు.

నాలాలపై అక్రమ కట్టడాలు తొలగించాలి

బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్
అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి


నాలా వద్ద ప్రధాన రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: నాలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బడంగ్‌పేటలో బీజేపీ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. స్థానికంగా ఆక్రమణలతో మూసుకుపోయిన నాలా వద్ద పార్టీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నాయకులతో వర్షంలో తడుస్తూ బైఠాయించారు. బీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నడికుడి యాదగిరి, బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డితో కలిసి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవతలగుట్ట, డిఫెన్స్‌లోని చెరువులు, నాదర్‌గుల్‌లోని చెరువులు నిండి నాలాల మీదుగా నీరు వస్తున్నాయన్నారు. వెంకటేశ్వరకాలనీ, కాశీబుగ్గ టెంపుల్, శివనారాయణపురం మీదుగా మంత్రాల చెరువు అటు నుంచి సరూర్‌నగర్ చెరువులోకి వరదనీరు వెళుతున్నాయన్నారు. కొందరు అక్రమార్కులు బడంగ్‌పేటలో నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ఎస్ఎన్‌డీపీ పనులు పేరుతో అసలైన నాలాలను పట్టించుకోకుండా చూసీ చూడనట్లు వ్యవహరించారన్నారు. రెండేళ్ల క్రితం భారీ వరదలకు 17కు పైగా కాలనీలు రెండు నెలల పాటు నీటిలో మునిగాయన్నారు. మళ్లీ వరదలు వస్తే కాలనీల పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. పలుమార్లు తహసీల్దార్, బడంగ్‌పేట కమిషనర్, ఆర్డీఓ, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం శూన్యమన్నారు. నాలాలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలాసందీప్, సంతోష్, నివేదిత, సైదులు, లక్ష్మణ్, నర్సింహారెడ్డి, పవన్, ప్రవీణ్, శశిధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. సందేశాత్మకం..



మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని మాజీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో గురువారం యూనిసన్ పేరిట జాతీయ గ్రూప్ ఆర్ట్‌షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. 30 మంది కళాకారులు వేసిన 55 చిత్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన 27వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు యం.వి.రమణారెడ్డి, రచయిత జయంత్‌రెడ్డి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం

చార్మినార్: లాల్‌దర్వాజాలోని సింహవాహిని అమ్మవారికి గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు బంగారు బోనంతో పాటు పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతరాజు విన్యాసాలతో జోగిని నిషాక్రాంతి బంగారు బోనంతో నృత్యాలు చేస్తూ ముందుకు నడుస్తుంటే మహిళా భక్తులు సాక పోసి సామూహిక ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో సప్త మాతృకల సప్త బంగారు బోనంలో భాగంగా గురువారం లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి సమర్పించిన బంగారు బోనంతో ఈసారి సప్త మాతృకల సప్త బంగారు బోనాల జాతర పూజా కార్యక్రమాలు ముగిశాయి.

రైతులను మోసం చేసిన సర్కారు

బీజేపీ కిసాన్ మోర్చా
రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

తుక్కుగూడ: ఎన్నికల సమయంలో రూ.2 లక్షల రుణమాఫీని ఎటువంటి ఆంక్షలు లేకుండా చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ద్రోహి అన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఏడు నెలలు కాలయాపన చేసి 567 జీఓ పేరుతో రైతులకు ఉరితాడును బిగించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. లేని పక్షంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్రంలోని రైతులకు అండగా నిలబడి పోరాటం చేస్తుందన్నారు. తమ పార్టీ రైతులకు అండగా ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్‌ను ఈనెల 27న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అదే రోజు మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రైతుల సంతకాల సేకరణ ఉంటుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలలు గడుస్తున్నా రైతు భరోసా నిధులను ఖాతాలో జమ చేయని అసమర్థ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు అంజయ్యయాదవ్, అంజయ్యగౌడ్, నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, సుదర్శన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

మహిళ ప్రతిఘటించడంతో
దుండగులు పరార్


చోరీకి యత్నించిన దుకాణం వద్ద వివరాలు తెలుసుకుంటున్న సీఐ

కొత్తూరు: సిగరెట్ల కోసం బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్‌కు యత్నించారు. మహిళ గట్టిగా ప్రతిఘటించడంతో ఇరువురూ పరారైన సంఘటన కొత్తూరు మండలంలోని కొడిచర్ల పంచాయతీ ఖాజిగూడతండాలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత మహిళ వివరాల మేరకు.. కొడావత్ మంజుల తండాలో ఉన్న తన ఇంటిలో కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తుంది. కాగా ఉదయం 11 గంటలకు బైకుపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు సిగరెట్లు కావాలని అడిగారు. వారు అడిగిన బ్రాండు లేవని చెప్పగా.. మరోసారు వచ్చిన వారు దుకాణంలో అందుబాటులో ఉన్న ఇతర సిగరెట్లు, అగ్గిపెట్టె, సోంపు తీసుకొని వెళ్లారు. తిరిగి రెండు నిమిషాల్లో మళ్లీ వచ్చిన యువకులు బిస్కెట్ ప్యాకెట్ ఇవ్వమని అడగ్గా.. అందులో ఒకడు ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును లాగాడు. వెంటనే తేరుకున్న మంజుల నిందితుడ్ని గట్టిగా ప్రతిఘటిస్తూ అరవడంతో వెంటనే ఇద్దరు బైకుపై పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ నర్సింహారావు ఘటనాస్థలానికి చేరుకుని బాధిత మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో చోరీకి పాల్పడిన యువకులు, బైకును గుర్తించేందుకు వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.